

విద్యుదుత్పత్తి వేగవంతం
జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి కొనసాగుతుంది.
వివరాలు 8లో ▸



పులుల సంరక్షణ..
పెద్ద పులులను రక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎఫ్‌డీఓ విశాల్ అన్నారు.
వివరాలు 8లో ▸

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం
32.3 /22.3
ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉదయం నుంచే ముసురు కమ్ముకుంటుంది. అడపాదడపా మోస్తరు వర్షం కురవొచ్చు.

వెల్లివిరిసిన మతసామరస్యం



ఊట్కూరులో ఊరేగిస్తున్న హసన్, ఉస్సేని పీర్లు



ఊట్కూర్‌లో పీర్లకు దట్టీ కప్పి మొక్కులు తీర్చుకుంటున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

- ఊట్కూర్‌లో భక్తిశ్రద్ధలతో మొహర్రం వేడుకలు
- కనులపండువగా డోలారోహణం
- మొక్కులు తీర్చుకున్న ఎమ్మెల్యే చిట్టెం
- బందోబస్తు పర్యవేక్షించిన ఎస్పీ

ఊట్కూర్: మతసామరస్యానికి ప్రతీక అయిన మొహర్రం వేడుకలు ఊట్కూర్‌లో శాంతియుతంగా ముగిశాయి. స్థానిక పెద్దపీర్ల మసీదులో పదిరోజుల పాటు ప్రతిష్ఠించిన ఉస్సేన్ పీర్లను నవమి సవారి సందర్భంగా శనివారం తెల్లవారుజామున గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. దశమి సవారి సందర్భంగా తిరిగి సాయంత్రం 6 గంటలకు పెద్దపీర్ల మసీదు నుంచి సవారి ప్రారంభమై గ్రామంలో ఊరేగిస్తూ నిమజ్జనం కోసం పెద్దచెరువుకు తరలివెళ్లాయి. గ్రామంలోని ప్రధాన కూడళ్లలో మహిళలు బొడ్డెమ్మలు, యువకులు డప్పులు కొడుతూ అలాయ్ ఆడారు. భక్తులు మేకపోతులు, గొర్రెపొట్టేళ్లతో కుందూర్లు చేసి మొక్కులు తీర్చుకున్నారు. వేడుకలకు ముంబాయి, పుణె, సోలాపూర్, బెంగళూర్, హైదరాబాద్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఆయన వెంట జెడ్పీటీసీ సభ్యుడు అశోక్ కుమార్‌గౌడ్, సర్పంచ్ సూర్యప్రకాశ్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు అరవింద్‌కుమార్, స్టేట్ ట్రేడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ప్రశాంత్‌రెడ్డి, వీజేఆర్ వ్యవస్థాపక అధ్యక్షుడు వర్కటం జగన్నాథ్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు బాల్‌రెడ్డి, నాయకులు జమీర్‌అలీ, రహిమాన్, సమీఉల్లా పాల్గొన్నారు.

వేడుకగా డోలారోహణం..

మొహర్రం వేడుకల్లో భాగంగా దేవీనగర్ దగ్గర అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం డోలారోహణ కార్యక్రమాన్ని కనులపండుగా నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఊయాలలో ఆరెకటిక కులానికి చెందిన శిశువును వేయగా ఉస్సేన్ పీర్లు ఊయల ఊపి బాలుడికి నామకరణం చేశారు. ఆయా వేడుకలను ఎస్పీ వెంకటేశ్వర్లు దగ్గరుండి పర్యవేక్షించారు. భద్రతా చర్యల్లో భాగంగా పెద్దపీర్ల మసీదు పరిసరాలు, ప్రధాన చౌరస్తాలలో బాంబు, డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేపట్టారు. బందోబస్తులో పేఎస్పీ నాగేంద్రుడు, డీఎస్పీ సత్యనారాయణ, సీఐ రాంలాల్, ఎస్ఐ గోకారి పాల్గొన్నారు.

ఖిల్లా కోట.. కిటకిట

కోయిల్‌కొండ: రాష్ట్రంలో అత్యంత ప్రసిద్ధిగాంచిన కోయిల్‌కొండ మొహర్రం ఉత్సవాలు శనివారం వైభవంగా ముగిశాయి. హిందుముస్లింల ఐక్యతకు మారుపేరుగా నిలిచే ఈ పండుగ పదిరోజులపాటు భక్తిశ్రద్ధలతో కలసిమెలసి జరుపుకొంటారు. రాష్ట్రం నుంచే కాక మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు కోయిల్‌కొండ ఖిల్లా కోటపై కొలువుదీరిన బీబీ ఫాతిమా పీరును దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం తెల్లవారుజామున మండల రెవెన్యూ కార్యాలయం నుంచి భాజాభజంత్రీలు, కాగడాలతో అధికారులు, గ్రామపెద్దలతో కలిసి ఖిల్లా కోటపైకి చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఆఖరి ఘట్టంగా బీబీ ఫాతిమా ఉత్సవ నిర్వాహకులు ఆధ్వర్యంలో పీరుకు గంధం పూసి ఆశన్న, ఊశన్న పీర్లను కోటపై నుంచి కిందకి తీసుకువచ్చి గ్రామంలో ఊరేగించారు. అలాగే తెల్లవారుజామున అగ్నిగుండం నిర్వహించారు. అనంతరం గ్రామంలో గండెల్‌సాహెబ్, బీబీఫాతిమా, ఉస్సేన్‌పచ్చ, ఖాశీంసాహెబ్ పీర్ల కలయిక ఆకట్టుకుంది. మధ్యాహ్నం 3 గంటలకు కోటపై నుంచి మొహర్రం కీలక ఘట్టమైన పీర్ల ఊరేగింపు ప్రారంభించారు. గ్రామంలో వివిధ ప్రాంతాల్లో ప్రతిష్ఠించిన పీర్లు సైతం బీబీ ఫాతిమాను అనుకరించాయి. ప్రధాన వీధుల గుండా బీబీ ఫాతిమా వెళ్తుంటే మహిళలు బొడ్డెమ్మ వేయగా.. యువకులు అలాయ్ ఆడుతూ భక్తిని చాటుకున్నారు. ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా హన్వాడ ఎస్ఐ రవినాయక్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.



ఖిల్లా కోటలో ఊరేగింపుగా బీబీ ఫాతిమా పీరు

భగీరథ ప్రయత్నం..

గంగమ్మ కోసం.. మూడు తరాలు తాపత్రయం

సండే స్పెషల్

- ఆరు ఎకరాల పొలంలో 104 బోర్లు వేసిన హన్మయ్య కుటుంబం
- 34 ఏళ్ల తర్వాత సఫలం.. తాజాగా వేసిన రెండు బోర్లలో నీరు
- బీడు భూమిని తరిగా మార్చి తాత కలను సాకారం చేసిన మనవడు



మనవడు వేసిన బోరు వద్ద హన్మయ్య

అనగనగా ఒక రైతు.. తనకున్న బీడు భూమిలో సాగు చేయాలంటే బోరుబావి తవ్వాల్సిందేనని 34 ఏళ్ల క్రితం బోరు బావికి పూనుకున్నాడు. నీళ్లు మాత్రం పడలేదు. దీంతో ఉన్న భూమిలోనే ఎలాగైనా గంగమ్మను పైకి తీసుకువచ్చి పంట పండించాలనే పట్టుదలతో బోర్లు వేస్తున్నారు. ఇలా 20 ఏళ్లలో దాదాపు 51 బోర్లు వేయగా.. 45వ సారి వేసిన బోరులో ఇంచు నీరు వచ్చే బోరు తగిలింది. దీంతో సాగు మొదలు పెట్టి కూరగాయలు పండించడం ప్రారంభించాడు. వయస్సు మీద పడినా ఏమాత్రం జంకకుండా ఇదే భూమిలో తన కొడుకులను సాగులోకి దింపాడు. వారు సైతం 24 బోర్లు వేసి ఇక భరించలేక మానేశాడు. ప్రస్తుతం అతని మనువడు వచ్చి తాత బాటలో మరోసారి భగీరథ ప్రయత్నం మొదలెట్టాడు. ఏడాదిన్నర కాలంలోనే 29 బోర్లు వేసిన ఆయన.. చివరికి రెండు నెలల క్రితం సఫలం అయ్యాడు. ఇలా వంశపారంపర్యంగా తాత, కొడుకులు, మనువడు చేసిన భగీరథ ప్రయత్నానికి బీడు భూమి.. తరిగా మారింది. తమ ఇంటిపేరునే మార్చుకునేంతలా బోర్లు వేసిన హన్మయ్య కుటుంబం మూడున్నర దశాబ్దాల కాలంలో సెంచరీ దాటి 104 బోర్లు వేయడం విశేషం.

– మహబూబ్‌నగర్ డెస్క్

మనవడు 29 సార్లు ప్రయత్నించి..

హన్మయ్య కాలంలో పడిన బోరు కొంత కాలం పనిచేసినా.. భూగర్భ జలాలు తగ్గడంతో అది కాస్త మొరాయించింది. ఆదే సమయంలో నాలుగేళ్ల క్రితం హన్మయ్య మనవడు భాస్కర్ (అంజయ్య కుమారుడు) సాగు చేసేందుకు పూనుకున్నాడు. హన్మయ్య చిన్నకుమారుడు పాండయ్య కూడా వారసత్వంగా వచ్చిన తన రెండెకరాలను భాస్కర్‌కు అప్పజెప్పాడు. తాత స్ఫూర్తితో భాస్కర్ నాలుగు ఎకరాల పొలంలో మరోసారి భగీరథ ప్రయత్నం మొదలు పెట్టాడు. 2019లో భాస్కర్ 18వ సారి వేసిన బోరులో కొద్దిపాటి నీళ్లు వచ్చాయి. అది సాగుకు సరిపోకపోవడంతో పొలంలో కొంతభాగాన్ని పౌల్ట్రీఫాంగా మార్చాడు. మళ్లీ ప్రయత్నాలు మొదలు పెట్టి 29 బోర్లు వేయగా.. ఎట్టకేలకు రెండు నెలల క్రితం సఫలమయ్యాడు. చివరిసారిగా వేసిన రెండు బోర్లలో ఒకదాంట్లో మూడు, మరో దాంట్లో రెండు ఇంచుల నీరు వచ్చింది. తాత కోరిక మేరకు బీడు భూమిని తరిగా మార్చి ఈ సీజన్‌లో వరి పండించేందుకు సిద్ధం అవుతున్నాడు. ప్రస్తుతం రెండు బోర్లు పూర్తిస్థాయిలో పనిచేస్తుండగా.. మరో రెండు ఓ మోస్తరుగా ఉన్నాయి.

▸ హన్మయ్య 1989 సంవత్సరంలో మొదటి బోరు వేశాడు. కాగా అప్పుడు మొదటి బోరుకు ఫీటుకు రూ.75 చొప్పున 120 ఫీట్లు వేశాడు. మొదటి బోరుకు రూ.9 వేల ఖర్చు అయ్యాయి. ఆయన అత్యధికంగా 180 నుంచి 250 ఫీట్ల వరకు బోర్లు వేశాడు. హన్మయ్య మనవడు భాస్కర్ 2019లో 300 ఫీట్లలో వేసిన బోరులో నీరు వచ్చింది. ఆయనకు అప్పుడు రూ.50 వేల వరకు ఖర్చు అయింది. రెండు నెలల క్రితం వేసిన బోర్లకు రూ.75 వేల వరకు ఖర్చు చేసినట్లు భాస్కర్ తెలిపారు.

ఆరెకరాల ఆసామి..

మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలంలోని పల్లెగడ్డకి చెందిన ఆరు ఎకరాల ఆసామి హన్మయ్య. తమ పూర్వీకుల నుంచి వారసత్వంగా వచ్చిన భూమి కావడంతో దానినే సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. అయితే భూమికి ఎలాంటి నీటి వనరులు లేకపోవడంతో 1989లో బోరు బావి తవ్వాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఒకటి, రెండు కాదు.. పదుల సంఖ్యలో బోర్లు వేసినా.. ఆరు ఎకరాల భూమి మొత్తం చిల్లులు పడినా.. చుక్క నీరు లేదు. దీంతో బోరులో నీరు పడేదాకా అలుపెరగని పోరాటం చేశాడు. ఎట్టకేలకు 45వ సారి వేసిన బోరులో ఒక ఇంచు నీరు పడగా.. ఆ నీటితోనే కూరగాయలు పండించడం ప్రారంభించాడు. ఆ తర్వాత కూడా బోర్లు వేయడం మాత్రం ఆపలేదు. స్థానికంగా బోర్ల హన్మంతుగా పేరొందని ఆయన..51బోర్లు వేసిన తర్వాత వయసు మీదపడడంతో తన భూమిని ముగ్గురు కొడుకులు అంజయ్య, కృష్ణయ్య, పాండయ్యకు అప్పగించాడు. వారు కూడా తండ్రిలాగే కూరగాయల సాగు చేసుకుంటూ.. ఆ ఆరు ఎకరాల్లో దాదాపు 24 బోర్లు వేశారు. అయినా ఒక్క చుక్క నీరు రాలేదు. అప్పటి వరకు ఉన్న ఒక్క బోరుతో వచ్చే నీటితో టమాట, బెండకాయ, తదితర కూరగాయలు పండిస్తూ నెట్టుకొచ్చారు.



కూరగాయల తోటలో హన్మయ్య కుమారుడు కృష్ణయ్య

తాత బాటలో నడిచా..



డిగ్రీ పూర్తి చేశా ఇక పై చదువులు చదువాలని అనుకుంటున్న తరుణంలోనే సాగుపై దృష్టిపెట్టాను. పొలంలో ఎక్కడ బోర్లు వేసిన నీరు రాలేదని తాత ద్వారా తెలిసినా మరో ప్రాంతంలో బోర్లు వేయడం ప్రారంభించా. మా తాత కోరిక తీర్చలనేది లక్ష్యంగా బోర్లు వేయించాను. దానికి తాత ప్రోత్సాహం కూడా ఉంది. ఇంట్లో వద్దన్నా వినకుండా ఇప్పటి వరకు 29 బోర్లు వేశాను. రెండునెలల క్రితం వేసిన బోరులో నీరు బాగా వచ్చింది.

–భాస్కర్ (హన్మయ్య మనవడు)

భూమినే నమ్ముకుని బతుకుతున్న..

భూమినే నమ్ముకుని బతుకుతున్నా. బీడు భూములను సాగు చేసి పంటలు పండించాలని బోర్ల మీద బోర్లు వేస్తున్నా. నీళ్లు పడకున్నా.. మళ్లీ బోర్లు వేయించా. మొదటి బోరుకు కేవలం రూ.9 వేలు ఖర్చు అయింది. ఇప్పుడు రూ.50 వేల నుంచి రూ.60 వేలు లేనిదే బోరు బండి పొలం గట్టుకు రావడం లేదు. ఒకసారి భూమి గిరువేసి అప్పులు తెచ్చి బోరు వేశాను. మళ్లీ నా మనవడు, ఆ డబ్బులు కట్టి తీసుకొచ్చాడు.

– హన్మయ్య (పల్లెగడ్డ)

SVS హాస్పిటల్ మహబూబ్‌నగర్
Dept of Radiology
అధునాతన MRI 3.0 Tesla స్కాన్
మెషిన్ SVS హాస్పిటల్ లో ఏర్పాటు చేయబడినది. ఈ స్కాన్ ద్వారా శరీరంలో సూక్ష్మాతి సూక్ష్మమైన లోపాలను తక్కువ సమయంలో గుర్తించబడును. అనుభవజ్ఞులైన రేడియాలజిస్టులచే రిపోర్ట్ వెంటనే ఇవ్వబడును. ఈ క్రింది తెలుపబడిన రేట్లు వర్తించును.
- MRI Brain - Rs.3500/
- MRI Any Spine / Any Joint - Rs.3500/
- MRI Whole Spine - Rs.4500/

గమనిక: ఈ స్కాన్ మెషిన్ బోర్ దయా పెద్దదిగా ఉండడం వలన స్కాన్ చేసేటప్పుడు పేషెంట్ కు భయం కలగదు.
వివరాలకు: ఈ 6303444232/7893888529 మొబైల్ నెంబర్ల పై సంప్రదించ గలరు.
Dept of Radiology
SVS Medical College Hospital

న్యూస్‌రీల్

ఓపీఎస్ అమలు చేసి ఎన్నికలకెళ్లాలి



నారాయణపేట రూరల్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల పక్షాన బీఆర్ఎస్ ప్రభుత్వం నిలబడి పాతపెన్షన్ విధానం అమలు చేసి ఎన్నికలకు వెళ్లాలని టీఎస్‌సీపీఎస్‌ఈయూ రాష్ట్ర అధ్యక్షుడు స్థితప్రజ్ఞ అన్నారు. ఓపీఎస్ సాధనే లక్ష్యంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో చేపడుతున్న సంకల్ప రథయాత్ర పదోరోజు శనివారం రాత్రి నారాయణపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి నేతృత్వంలో స్థానిక సుభాష్‌చంద్రబోస్ విగ్రహం నుంచి ప్రారంభమైన ర్యాలీ సెంటర్ చౌక్, వీరసవార్కర్ చౌరస్తా, శ్రీసత్యనారాయణ సర్కిల్, కొత్తబస్టాండ్ మీదుగా అంబేడ్కర్ కూడలికి చేరుకుంది. అనంతరం ఆయన మాట్లాడుతూ పాతపెన్షన్ అమలు చేయడం రాష్ట్రాల పరిధిలోని అంశమేనని రాజస్థాన్‌తో పాటు 6 రాష్ట్రాలు రుజువు చేశాయన్నారు. తెలంగాణలో 3.35 లక్షల మంది ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల ఆకాంక్షను నెరవేర్చాల్సిన బాధ్యత కేసీఆర్‌పై ఉందన్నారు. ఉద్యోగ విరమణ వయస్సు పెంచినా సీపీఎస్ రద్దు చేయలేదని వాపోయారు. 19 ఏళ్లుగా ఎన్నో సీపీఎస్ కుటుంబాలు మానసిక వేదనకు లోనవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ సొమ్ము ఎన్‌పీఎస్ ట్రస్టులో రూ.16 వేల కోట్ల పింఛన్ నిధిగా ఉందని, దీంతో సీపీఎస్ రద్దు చేసి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు చేపట్టవచ్చన్నారు. సీపీఎస్ ఉద్యోగుల బలం కనిపించాలని, గళం వినిపించేందుకు ఆగస్టు 12న హైదరాబాద్‌లో చేపట్టే బహిరంగ సభకు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. జూలై 1 నుంచి పీఆర్‌సీ అమలు బెనిఫిట్స్ ఇవ్వాలని, నష్టపోయిన రెండు పీఆర్‌సీలపై న్యాయం చేయాలని, ఉద్యోగుల భాగస్వామ్యంతో నగదు రహిత వైద్యం అందించాలని కోరారు. అనంతరం శాలువా, బస్సు బొమ్మతో సన్మానించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్, కోశాధికారి నరేష్‌గౌడ్, సీపీఎస్ జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి, కార్యదర్శి రాఘవేంద్రచారి, తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, రిటైర్డ్ ఉద్యోగుల సంఘం కార్యదర్శి సంతోష్‌కుమార్, విద్యాసాగర్, లక్ష్మీకాంత్, యశ్వంత్, బాలాజీ, నర్సింహ, రాజేందర్‌రెడ్డి, శంకరప్ప, శ్రీనివాస్, సంతోష్‌రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

కొరవడిన పారదర్శకత

విద్యాశాఖలో అమలుకాని బయోమెట్రిక్ విధానం



పాఠశాలలకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న విద్యా శాఖాధికారులు

- జిల్లాకేంద్రానికి 20 కిలోమీటర్ల దూరంలో పనిచేసే ప్రభుత్వ ఉపాధ్యాయులు ప్రతిరోజు ఉదయం 9 గంటలు దాటినా పట్టణంలోని ప్రైవేటు స్కూల్‌లో తమ సొంత పిల్లలను డ్రాప్ చేస్తూ కనిపిస్తారు. వారు పనిచేసే బడికి ఏ ఒక్క రోజు సమయానికి వెళ్లరు.
- మహబూబ్‌నగర్‌లో నివాసం ఉంటూ నారాయణపేట జిల్లాలో పనిచేస్తున్న టీచర్లు కోకొల్లలు. వీరిలో చాలామంది ఏనాడు ప్రార్థనా సమయానికి తమ పాఠశాలలకు చేరుకోరు.
- దామరగిద్ద, ధన్వాడ, ఊట్కూర్ మండలాల్లో పనిచేసే టీచర్లు పాఠశాల సమయం దాటినా రోజు పాతబస్టాండ్, అంబేద్కర్ చౌరస్తాలోనే కనిపిస్తారు. వీరు కూడా సమయపాలన పాటించరు.
- జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేసే కొందరు టీచర్లు బిల్లులు, ఇతరత్రా కారణాల పేరుతో ఎస్టీఓ కార్యాలయం దగ్గర, మెడికల్ బిల్లు, బ్యాంకు పని అంటూ తిరుగుతూ పాఠశాలలకు వెళ్లకుండా ఇక్కడే కాలక్షేపం చేస్తుంటారు.
- ఇలాంటి వారందరికీ చెక్ పెడుతూ బయోమెట్రిక్ విధానం అమలు చేయాలని గతంలోనే ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గతేడాది వరకు దాదాపు 18 జిల్లాలో ఈ విదానం ప్రవేశపెట్టి సత్ఫలితాలు ఇవ్వడంతో వాటిని మరిన్ని జిల్లాలకు విస్తరించాలని సంకల్పించింది. ఇందులో భాగంగా గత విద్యా సంవత్సరం జనవరిలోగా నారాయణపేట జిల్లాలోనూ ప్రారంభించేందుకు కసరత్తు పూర్తి చేసినా.. నేటికీ ఆచరణలో అమలు కాలేదు.

- ట్యాబ్‌లు పంపిణీ చేసినా ప్రారంభానికి నోచుకోని వైనం
- తాజాగా ఇంటర్‌నెట్ సౌకర్యం కల్పించేందుకు టెండర్లు
- విద్యార్థులు, ఉపాధ్యాయుల వివరాల సేకరణ పూర్తి
- ఈ విద్యాసంవత్సరమైనా అందుబాటులోకి తేవాలని సూచన

నారాయణపేట రూరల్: బయోమెట్రిక్ విధానం అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో అన్ని రకాల ప్రభుత్వ శాఖల్లో వీటిని ఏర్పాటు చేయాలని అప్పటి కలెక్టర్ ఆదేశించారు. ఈ మేరకు అన్ని శాఖలకు సంబంధించి పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది వివరాలను సేకరించారు. ప్రతి జీపీలోనూ వీటి ఏర్పాటుకు కసరత్తు చేశారు. అన్ని శాఖలకు సమాంతరంగా విద్యాశాఖలో బయోమెట్రిక్ విధానం ప్రవేశపెట్టాలని భావించి ముందుగా డీఈఓ, ఎమ్మార్సీల్లో ఏర్పాటు చేయాలని సంకల్పించారు. అయితే స్థానిక ఎమ్మార్సీలో మిషన్ ఏర్పాటు చేయగా.. చుట్టుపక్కల అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు అక్కడే వేలి ముద్ర వేస్తున్నారు. అలాగే ప్రతి పాఠశాలలో మిషన్ పెట్టిన తర్వాత ఉపాధ్యాయుల హాజరు, అటు తర్వాత విద్యార్థులు సైతం తమ హాజరును వేలిముద్రలతోనే నమోదు చేసుకోవాలని భావించారు.

ట్యాబ్‌ల పంపిణీ..
బయోమెట్రిక్ విదానం కంటే కొత్త తరహా సాంకేతిక పరిజ్ఞానంతో ముందుకు పోవాలని భావించి బయోమెట్రిక్ విదానాన్ని పక్కన పెట్టారు. ఫేస్ స్కానింగ్‌తో కూడిన కొత్త వర్షన్‌కు అప్‌డేట్ చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు జిల్లాలోని 294 ప్రాథమిక పాఠశాలలకు 326 ట్యాబ్‌లు, 85 ప్రాథమికోన్నత పాఠశాలలకు 123 ట్యాబ్‌లను ఇటీవల అందించారు. మిగతావి త్వరలోనే సరఫరా కానున్నాయి. అయితే ఉన్నత పాఠశాలల్లో గతంలో ఐసీటీ స్కీం కింద వచ్చిన కంప్యూటర్లు వాడాలని ముందుగా భావించినా అవి నిరుపయోగంలో ఉండటంతో వాటి స్థానంలో ఇతర పరికరాలను అందించాలని చూస్తున్నారు. అలాగే ఇంటర్‌నెట్ సౌకర్యం కోసం టెండర్ వేయగా.. త్వరలోనే అందుబాటులోకి రానున్నట్లు సమాచారం.

మధ్యాహ్న భోజన విషయంలోనూ..
చాలా పాఠశాలల్లో వచ్చిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగానే మధ్యాహ్న భోజనం వండుతారు. కానీ, రికార్డుల్లో మాత్రం అంతకు ఎక్కువ మందిని చూపిస్తారు. దీనికితోడు పట్టణ ప్రాంతాల్లోని స్కూళ్లలో పిల్లలు ఎక్కువ శాతం ఇంటికి వెళ్లడం, ఇంటి నుంచి బాక్స్ తెచ్చుకోవడం కనిపిస్తుంది. కానీ, ఇక్కడే భోజనాలు పెట్టినట్లు నమోదు చేస్తారు. ఇలాంటి వాటి వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుంది. వీటన్నింటికీ కళ్లెం వేయడానికి బయోమెట్రిక్ ఎంతగానో ఉపయోగపడనుంది.

వసతి గృహాలు.. ఉపకార వేతనాలు
వసతి గృహాల్లో ఉండే విద్యార్థుల సంఖ్య తేలేందుకు ఈ విధానం ఎంతో ఉపకరిస్తుంది. విద్యార్థులు లేకపోయినా పేర్లు నమోదు చేసి వారికి ప్రభుత్వం ఇచ్చే వస్తువులను పక్కదారి పట్టించేవారు. దీన్ని పూర్తిగా అరికట్టే అవకాశం ఉంది. విద్యార్థుల హాజరు విషయంలో కళాశాలలు 75 శాతం చూయించడానికి అవకాశం ఉండదు. స్కాలర్‌షిప్ పొందాలంటే ఇక నుంచి విద్యార్థులు రెగ్యులర్‌గా విద్యాసంస్థలకు వచ్చి వేలిముద్ర వేయాల్సిందే. దీంతో పాఠశాలల్లో హాజరుశాతం పెరగడానికి ఆస్కారం ఉంటుంది.

త్వరలోనే ప్రారంభిస్తాం..



విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు నమోదులో పారదర్శకత కోసం చర్యలు చేపడుతున్నాం. బయోమెట్రిక్ కంటే ట్యాబ్‌ల ద్వారా సరికొత్త టెక్నాలజీతో హాజరు నమోదు జరుగుతుంది. జిల్లాలో ఇప్పటికే 449 ట్యాబ్‌లు పంపిణీ చేశాం. మరికొన్ని త్వరలోనే వస్తాయి. నెట్ కనెక్షన్ రాగానే ప్రభుత్వ ఆదేశాల తర్వాత ప్రారంభమవుతుంది.

– శ్రీనివాస్, సెక్టోరియల్ అధికారి

పాఠశాలలు 500	ఉపాధ్యాయులు 1,982
విద్యార్థులు 67,875	ఇప్పటి వరకు ఇచ్చిన ట్యాబ్‌లు : 449

గైర్హాజరుకు అడ్డుకట్ట

చాలాచోట్ల టీచర్లు పాఠశాలకు వెళ్లకపోయినా రిజిష్టర్‌లో సంతకాలు చేస్తున్న ఉదంతాలు ఉన్నాయి. ఒకరు, ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నచోట ఇలాంటివి బయటపడుతున్నాయి. చాలా వరకు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల్లో వంతుల వారీగా సెలవు పెట్టినట్లు లీవ్ లెటర్ పెట్టి.. మరుసటి రోజు మళ్లీ సంతకాలు చేస్తున్నారు. వాస్తవంగా క్లస్టర్ గ్రూప్ ఉన్నప్పటికీ అందులో సెలవు పెట్టిన టీచర్ల వివరాలు మాత్రం పోస్టు చేయడం లేదు. దీంతో వారు ఇలా మరునాడు సంతకాలు చేస్తున్నారనేది తేటతెల్లమవుతుంది. ఇలాంటి వాటికి చెక్ పెట్టడానికే ఈ విధానం ఎంతో ఉపకరిస్తుంది.

నిరుద్యోగుల జీవితాలతో ఆడుకోవద్దు

నారాయణపేట రూరల్: ఉద్యోగ నియామక ప్రక్రియలో భాగంగా నిర్వహించే పరీక్షలకు సంబంధించి కేంద్రాలను ఒక్కొక్కటి ఒక్కోచోట వేసి అభ్యర్థులను తికమక పెట్టడం సరికాదని పీవైఎల్ రాష్ట్ర అధ్యక్షుడు కాశీనాథ్ విమర్శించారు. గురుకుల జేఎల్, టీజీటీ, పీజీటీ, లైబ్రేరియన్ ఉద్యోగాలకు ఆగస్టు 1 నుంచి 23 వరకు పరీక్షల టైం టేబుల్ విడుదల చేయగా.. దానికి దరఖాస్తు చేసుకున్న నిరుద్యోగులకు ఒక్కో పరీక్ష ఒక్కోచోట వేసి ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పరీక్ష రాసే వారిలో వికలాంగులు, గర్భిణులు, చిన్నపిల్లలు ఉన్న తల్లులు ఉన్నారని, జూన్ 30న గురుకుల బోర్డు కన్వీనర్‌కు లెటర్ ఇచ్చిన పట్టించుకోకపోవడం సరికాదన్నారు. తక్షణమే రోజుకు రెండు షిఫ్టుల్లో స్థానిక జిల్లాల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసి నిర్వహణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య


సయ్యద్ ముజఫర్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రైం: రైలు కిందపడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. రైల్వే ఎస్ఐ సయ్యద్ అక్బర్ కథనం ప్రకారం..మహబూబ్‌నగర్‌లోని బండ్లగేరికి చెందిన సయ్యద్ ముజఫర్(22) శనివారం పట్టణంలోని వీరన్నపేట సమీపంలో గుర్తు తెలియని రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తలతో పాటు కాళ్లు, చేతులు పూర్తిగా తెగిపోవడంతో గుర్తించలేనివిధంగా మారింది. మృతదేహాన్ని జిల్లా జనరల్ ఆస్పత్రి పోస్టుమార్టం విభాగానికి తరలించారు. అయితే మృతి చెందిన యువకుడు డిగ్రీ పూర్తి చేసి తండ్రితో పాటు ఇటుకల వ్యాపారం చేస్తున్నాడు. మృతుడి కుటుంబసభ్యులు సయ్యద్ ముజఫర్ మృతిపై అనుమానం ఉందని ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెల్లడించారు.

బాలికను బలి తీసుకున్న ఊయల చీర

అచ్చంపేట రూరల్: ఇంటివద్ద చీరతో కట్టిన ఊయలలో ఆడుకుంటున్న ఓ బాలిక ప్రమాదవశాత్తు ఉరిపడి మృతి చెందిన ఘటన శనివారం చోటు చేసుకుంది. సిద్దాపూర్ హెడ్‌కానిస్టేబుల్ రెడ్యానాయక్ కథనం ప్రకారం.. బొమ్మన్‌పల్లికి చెందిన పరశురాములు చిన్న కూతురు శ్రావణి(10) ఇంటి ఆరుబయట చీరతో కట్టిన ఊయలలో శుక్రవారం ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు బాలిక మెడకు ఉరి పడింది. వెంటనే కేకలు వేయడంతో కుటుంబ సభ్యులు వచ్చి ఊయల నుంచి తీశారు. అపస్మారక స్థితికి వెళ్లిన బాలికను వెంటనే అచ్చంపేట ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం నాగర్‌కర్నూల్ ప్రభుత్వాస్పత్రికి తరలించగా, అక్కడి నుంచి హైదరాబాద్ రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ బాలిక శనివారం మృతి చెందింది. కుటుంబ సభ్యుడు భాస్కర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

కృష్ణానదిలోకి దూకిన రాయచూర్ వ్యక్తి

కృష్ణా: మండల సరిహద్దులోని కృష్ణా బ్రిడ్జిపై నుంచి ఓ వ్యక్తి నదిలోకి దూకిన ఘటన శనివారం చోటుచేసుకుంది. శక్తినగర్ పోలీసుల కథనం ప్రకారం.. కర్ణాటకలోని రాయచూర్ పట్టణానికి చెందిన నర్సప్ప(61) తమ కుటుంబ కలహాలతో శనివారం మధ్యాహ్నం కృష్ణా బ్రిడ్జిపైకి ఎక్కి నదిలో దూకాడు. దీన్ని గమనించిన ప్రయాణికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడి చేరుకుని నర్సప్ప కోసం గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలు రంగంలోకి దిగి రాత్రి వరకు వెతికినా ఆచూకీ లభించలేదు. తిరిగి ఉదయం అతని ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడతామని శక్తినగర్ పోలీసులు తెలిపారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

కొత్తకోట రూరల్: మండల కేంద్రానికి కూతవేటు దూరంలోని కానాయపల్లి నుంచి కొందరు మట్టిని అక్రమంగా తరలించి ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. కానాయపల్లి చెరువు నుంచి జేసీబీ సహాయంతో కొందరు పదుల సంఖ్యలో ట్రాక్టర్ల ద్వారా అనుమతి లేకుండా మట్టి తరలిస్తూ.. దందా సాగిస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఇప్పటికైనా రెవెన్యూ, మైనింగ్ అధికారులు మట్టి అక్రమ తవ్వకాలను నివారించాలంటూ గ్రామస్తులు కోరుతున్నారు.

మాజీ మంత్రి జూపల్లికి షాక్..

- బీఆర్ఎస్‌లో చేరిన కోడేర్ ఎంపీపీ



కోడేరు: మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రధాన అనుచరుడు కోడేరు ఎంపీపీ కొండ వెంకటరాధ, కొండ సుధాకర్‌రెడ్డి, ఎత్తం భాస్కర్‌రెడ్డిలు శనివా రం బీరం హర్షవర్ధన్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు బూరెడ్డి రఘువర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఐటీ శాఖ మంత్రి కేటీఆర్, విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీ బలోపేతానికి కృషి చేసి, రాబోయే ఎన్నికల్లో ఎ మ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిని గెలిపించేందుకు కృషి చేయాలని మంత్రులు వారికి సూచించారు.

విద్యుదుత్పత్తి వేగవంతం

- 12 యూనిట్లలో 474 మెగావాట్ల విద్యుదుత్పత్తి
- జూరాలకు ఉదయం 2.2లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- సాయంత్రానికి తగ్గిన వరద ప్రవాహం
- ఎత్తిపోతల పథకాలకు కొనసాగుతున్న నీటి పంపింగ్


జూరాల ప్రాజెక్టు నుంచి ఉరకలేస్తున్న కృష్ణమ్మ

గద్వాలరూరల్/ఆత్మకూర్/ధరూర్: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ఎగువ, దిగువ జలవిద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తి వేగవంతంగా కొనసాగుతుంది. శనివారం 12 యూనిట్లలో పూర్తిస్థాయిలో విద్యుదుత్పత్తి చేపట్టినట్లు ఎస్ఈ రామసుబ్బారెడ్డి, డీఈ పవన్‌కుమార్ తెలిపారు. ఎగువలో 6 యూనిట్ల ద్వారా 234 మెగావాట్లు, దిగువలో 6 యూనిట్ల ద్వారా 240 మెగావాట్లు విద్యుదుత్పత్తిని చేపట్టారు. ఇప్పటివరకు 30.941 మిలియన్ యూనిట్ల విద్యుదుత్పత్తిని సాధించామని పేర్కొన్నారు. కాగా.. ఎగువ ప్రాంతంలోని ఆలమట్టి, నారాయణపూర్ నుంచి జూరాల ప్రాజెక్టుకు వరద కొనసాగుతోంది. శుక్రవారం సాయంత్రం 6గంటలకు మొదలైన వరద శనివారం క్రమంగా పెరుగుతూ ఉదయం 9 గంటలకు ఇన్‌ఫ్లో 2.20లక్షల క్యూసెక్కులకు చేరింది. దీంతో 31 గేట్లు ఎత్తి దిగువనున్న శ్రీశైలానికి 1,94,626 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. క్రమంగా మధ్యాహ్నం 12 గంటల తరువాత తగ్గుతూ 2 లక్షల క్యూసెక్కులు, 3 గంటల సమయంలో 1.90లక్షల క్యూసెక్కులు, సాయంత్రం 6గంటలకు 1,68,000 క్యూసెక్కులకు తగ్గింది. శనివారం రాత్రి 10 గంటల సమయంలో ఇన్‌ఫ్లో 1,35,900 క్యూసెక్కులకు తగ్గడంతో ఆరు గేట్లు మూసివేశారు. 25 క్రస్టు గేట్లు ఎత్తి స్పిల్‌వే ద్వారా 1,15,033 క్యూసెక్కులు విడుదల చేశారు. విద్యుదుత్పత్తికి మరో 30,072 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. నెట్టెంపాడు ఎత్తిపోతలకు 750 క్యూసెక్కులు, భీమా–1కు 650 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 640 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ జుబేర్ తెలిపారు. మరోవైపు కోయిల్‌సాగర్, భీమా–2లకు ఇంకా పంపింగ్‌ను ప్రారంభించలేదన్నారు. మొత్తం జూరాల నుంచి 1,47,232 క్యూసెక్కుల ఔట్ ఫ్లో ఉంది. రాత్రి 8 గంటల సమయంలో ఆలమట్టి నుంచి 75వేల క్యూసెక్కులు, నారాయణపూర్ నుంచి 77,500క్యూసెక్కుల నీటిని జూరాలకు విడుదల చేస్తున్నారు.


రామన్‌పాడులో నీటిమట్టం

రామన్‌పాడుకు కొనసాగుతున్న వరద

మదనాపురం: మదనాపురం మండలంలోని రామన్‌పాడు జలాశయానికి వరద కొనసాగుతోంది. శనివారం ఊకచెట్టు పెద్దవాగు, చిన్నవాగు నుంచి జలాశయానికి వరద వస్తోంది. అధికారులు ఒక గేటు ఎత్తి 1500 క్యూసెక్కుల నీటిని దిగవకు వదులుతున్నారు. ప్రాజెక్టులో నీటిమట్టం 1,021.6 అడుగులకు వచ్చి చేరింది. జూరాల ఎడమ కాలువ నుంచి 640 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. కుడి కాలువ నుంచి 10 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 10 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. తాగు నీటి అవసరాలకు 20 క్యూసెక్కుల నీటిని వినియోగిస్తున్నట్లు ఏఈ రనీల్‌రెడ్డి తెలిపారు.

సుంకేసులకు..

రాజోళి: సుంకేసుల డ్యాముకు ఎగువ నుంచి వరద నీరు వస్తోంది. ఎగువన కురుస్తున్న వర్షాలు, ప్రాజెక్టుల నుంచి వస్తున్న నీటితో డ్యాంకు నీరు చేరుతోంది. దీంతో అధికారులు నీటిని దిగువకు వదులుతున్నారు. శనివారం ఎగువ నుంచి 2,181 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో రాగా, ఒక గేటు తెరిచి అంతే నీటిని దిగువకు విడుదల చేస్తున్నట్లు జేఈ రాజు తెలిపారు.

25 అడుగులకు కోయిల్‌సాగర్ నీటిమట్టం

దేవరకద్ర: కోయిల్‌సాగర్ ప్రాజెక్టులో నీటి మట్టం పాత అలుగు (26.5 అడుగులు)కు చేరువైంది. శనివారం సాయంత్రం వరకు నీటి మట్టం 25 అడుగులకు చేరుకుంది. రెండురోజుల్లో గరిష్టస్థాయికి చేరే అవకాశం ఉంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 32.6 అడుగులుగా ఉంది. ప్రస్తుతం కోయిల్‌సాగర్ ఎత్తిపోతలను నిలిపివేశారు. కేవలం పెద్దవాగు ద్వారానే ప్రాజెక్టులోకి నీటి ప్రవాహం ఉంది.

బీచుపల్లిలో మునిగిన పుష్కరఘాట్లు

ఎర్రవల్లిచౌరస్తా: జూరాల నుంచి వరద భారీగా వస్తుండడంతో ఇటిక్యాల మండలంలోని బీచుపల్లి పుష్కరఘాట్లు వరద నీటిలో మునిగిపోయాయి. బ్రిడ్జి దగ్గర కృష్ణమ్మ నిండుకుండలా ప్రవహిస్తూ శ్రీశైలం వైపు పరుగులు పెడుతోంది. నదికి అధికంగా వరద నీరు రావడంతో చుట్టుపక్కల ప్రాంతాలను నుంచి సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చి కృష్ణానది అందాలను తిలకిస్తూ సెల్ఫీలు తీసుకున్నారు.


బీచుపల్లి పుష్కరఘాట్లు మునిగి ప్రవహిస్తున్న కృష్ణమ్మ

జాతీయ రహదారిపై లారీ, టిప్పర్ బీభత్సం

- హోటల్, టీస్టాల్‌లోకి దూసుకెళ్లిన వాహనాలు..
- తప్పిన పెను ప్రమాదం
- అఖిలపక్షాల ఆధ్వర్యంలో రాస్తారోకో..


హోటల్లోకి దూసుకెళ్లిన లారీ


బస్సును ఢీ కొట్టి టీ స్టాల్‌పైకి వెళ్లిన టిప్పర్

కృష్ణ: కర్ణాటకలోని యాద్గీర్ వైపు నుంచి రాయచూర్‌కు వెళ్తున్న లారీ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల టైరోడ్డు వద్ద అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొని నేరుగా హోటల్లోకి దూసుకెళ్లింది. అదే సమయంలో ఆర్టీసీ బస్సును టిప్పర్ ఢీకొట్టి టీస్టాల్లోకి దూసుకెళ్లిన ఘటన పది నిమిషాల వ్యవధిలోనే చోటుచేసుకుంది. కృష్ణ మండలం గుడేబల్లూర్ పరిధిలోని టైరోడ్డు వద్ద శనివారం గుల్బర్గ నుంచి టాయిలెట్ పౌడర్ లోడ్‌తో చైన్నై వెళ్తున్న లారీ రాయిచూర్ వైపునకు తిరగాల్సి ఉండగా, డ్రైవర్ మద్యం మత్తులో విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడడంతో నేరుగా సుభాష్ హోటల్లోకి వెళ్లింది. అదే సమయంలో హైదరాబాద్ నుంచి రాయిచూర్ వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ రోడ్డుకు అడ్డంగా సీసీకెమెరా తీగలు కనిపించడంతో సడన్ బ్రేక్ వేశాడు. దీంతో వెనకాల వస్తున్న టిప్పర్ బస్సును ఢీకొట్టి పక్కనున్న టీస్టాల్ పైకి వెళ్లింది. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

అఖిలపక్షం ఆధ్వర్యంలో రాస్తారోకో..

నిత్యం ప్రమాదాలకు కాంట్రాక్టర్ నిర్లక్ష్యపు పనులే ప్రధాన కారణమని అఖిలపక్షాల ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ప్రధాన కూడలిలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడంతోనే ఏడేళ్లుగా ప్రమాదాలు సంభవిస్తున్నాయని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. లింక్ రోడ్డుకు తప్పనిసరిగా స్పీడ్ బ్రేకర్ల వేయాలని అధికారులు చెప్పినా కాంట్రాక్టర్ పట్టించుకోలేదన్నారు.

■ అదే సమయంలో నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి రాయిచూర్ వెళ్తూ అక్కడికొచ్చారు. టైరోడ్డు కూడలిలో స్పీడ్ బ్రేకర్స్ వేయించేందుకు అధికారులు సూచించి సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో రాస్తారోకో విరమించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు వాకిటి లక్ష్మీ నారాయణ, వైస్ ఎంపీపీ ఆర్ వెంకటేష్, ఆంజనేయులు, క్రిష్ణమూర్తి, ఆంజనేయులు, రామకృష్ణ, రాకేష్, తిమ్మప్ప, కృష్ణ, ముడుమాల్ వెంకటేష్ పాల్గొన్నారు.


రాస్తారోకో చేస్తున్న అఖిలపక్షాల నాయకులు

పులుల సంరక్షణ అందరి బాధ్యత


ప్రతాపరుద్రుడి కోట ప్రదేశంలో అటవీశాఖ అధికారులు, సిబ్బంది

- అటవీశాఖ ఎఫ్‌డీఓ విశాల్

మన్ననూర్: జీవ వైవిధ్యానికి ప్రధాన ఆధారమైన పెద్ద పులులను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని అటవీశాఖ ఎఫ్‌డీఓ విశాల్ అన్నారు. శనివారం అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని అటవీశాఖ అధికారులు, సిబ్బంది ఆయా పాఠశాలల విద్యార్థుల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీబీఈటీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పర్యావరణ వ్యవస్థలో పులులు పోషిస్తున్న కీలక పాత్రను గుర్తించాలన్నారు. పులి అంటే శక్తి, ఓ ఆకర్షణీయమైన ప్రతీక మాత్రమే కాదని, అది ప్రకృతి సమతుల్యతను కాపాడే కీస్టోన్ జాతి అని గ్రహించాలన్నారు. పులి మనుగడపై అడవి, పర్యావరణం, ప్రకృతి, జంతుజాలం, గడ్డి భూములు, వన్యప్రాణులు, జీవవైవిధ్యం ప్రత్యక్షంగా పరోక్షంగాను ఆధారపడి ఉన్నందున మానవాళి మనుగడకు ప్రధానమైందన్నారు. పులుల వల్ల మానవాళికి జరుగుతున్న మంచి గురించి ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా అందరికి తెలియజేయాలన్నారు. గ్రామంలోని పీటీజీ బాలుర, ఎస్‌డబ్ల్యూఆర్ఎస్ బాలికల పాఠశాలల్లో మూడో రోజుల క్రితం అటవీశాఖ తరుపున నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీలలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. అంతకు ముందు ప్రతాపరుద్రుని కోట పరిసరాల్లో పర్యటించి, ఆ ప్రదేశంలో సంచరించే పక్షులు, సీతాకోక చిలుకల జాతులను పరిశీలించారు. అటవీశాఖ చెక్‌పోస్టు నుంచి పీటీజీ పాఠశాల, లింగమయ్య వద్ద ఉన్న బాడర్ చెక్‌పోస్టు వరకు బైక్ ర్యాలీ నిర్వహించి బేస్ క్యాంపు వద్ద మొక్కలు నా టారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్ఓలు ఈశ్వర్, ప్రభాకర్, ప్రసాద్, బయాలజిస్టులు మధన్‌రెడ్డి, మహేందర్, శ్యామ్ ప్రసాద్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

బీచుపల్లిలో నిజరూప దర్శనం

ఎర్రవల్లిచౌరస్తా: బీచుపల్లి పుణ్యక్షేత్రంలో ఏకాదశిని పురస్కరించుకొని శనివారం భక్తులకు ఆంజనేయస్వామి నిజరూప దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు బీచుపల్లి పుణ్యక్షేత్రానికి చేరుకొని భక్తి శ్రద్ధలతో పూజలు చేశారు. అనంతరం ఆలయ ధ్వజస్తంభం ముందు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.



ఉపాధ్యాయులు, సిబ్బందిపై ఆగ్రహం

- గురుకులాన్ని సందర్శించిన ఆర్‌సీఓ నాగార్జున


ఉపాధ్యాయులు, విద్యార్థినీలతో మాట్లాడుతున్న ఆర్‌సీఓ నాగార్జున

గండేడ్: మండల పరిధిలోని సల్కర్‌పేట్ గురుకుల పాఠశాలలో తరుచుగా జరుగుతున్న ఘటనలపై ఆర్‌సీఓ నాగార్జున ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన గురుకుల పాఠశాలను సందర్శించి, బుధవారం రాత్రి జరిగిన ఘటనపై ఆరా తీశారు. ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఉపాధ్యాయులను, సిబ్బందిని ఆయన ప్రశ్నించారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యార్థినీలకు రక్షణగా పాఠశాల తరగతి గదులకు, డార్మెంటరీలకు గ్రిల్స్ ఏర్పాటు చేస్తామన్నారు. రాత్రివేళలో విద్యార్థినీల దగ్గర నలుగురు ఉండాలని, ఇద్దరు టీచర్లు, ఒక రెగ్యులర్ వాచ్‌మెన్, ఒకరు సిబ్బంది విధుల్లో ఉండాలని సూచించారు. విద్యార్థినీలకు ఎలాంటి అసౌకర్యం కలిగినా తమ దృష్టికి తేవాలన్నారు. తర్వాత ఉపాధ్యాయులకు సూచనలు, సలహాలు చెప్పి మహమ్మదాబాద్ పోలీస్‌స్టేషన్ వెళ్లి ఎస్ఐ సురేష్‌తో మాట్లాడారు. గురుకుల ఘటనకు సంబంధించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, రాత్రివేళలో పోలీసుల గస్తీ పెంచాలని కోరారు. దీనిపై ఎస్ఐ సురేష్ స్పందిస్తూ తప్పకుండా గస్తీ పెంచుతామని తెలిపారు.

సైబర్ మోసం.. మహిళ ఆత్మహత్య


బాబమ్మ(ఫైల్)

గండేడ్: లక్ష రూపాయలకు ఆశపడి మోసానికి గురై ఉరేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ ఏరియాలో చోటుచేసుకుంది. బాధితులు, పోలీసుల కథనం ప్రకారం.. సల్కర్‌పేట్‌కు చెందిన బాబమ్మ(33) నాలుగేళ్ల క్రితం ఎదిరకు చెందిన రమేష్‌ను ప్రేమించి పెళ్లి చేసుకుంది. బతుకుదెరువు కోసం ఇద్దరు హైదరాబాద్ వెళ్లి ఎల్‌బీ నగర్ ఏరియాలోని గుడ్డి జంగయ్య కాలనీలో నివాసం ఉంటున్నారు. రమేష్ లేబర్ పనిచేస్తుండగా బాబమ్మ కళాజాత బృందం కార్యక్రమాలకు వెళ్తుండేది. ఇటీవల బాబమ్మ ఫేస్‌బుక్‌లో ధని యాప్ ఫైనాన్స్ అని వచ్చింది. దాన్ని ఓపెన్ చేస్తే రూ.4500 కడితే లక్ష రూపాయలు లోన్ వస్తుందని, 24 నెలల పాటు రూ.4,230 చొప్పున కట్టాలని ఉంది. దీంతో ఆమె యాప్‌లోని నంబర్‌కు ఫోన్ చేసి వారితో మాట్లాడింది. తనకు లోన్ కావాలని చెప్పడంతో రూ.4500 అకౌంట్‌లో వేయాలని వారు నంబరు ఇచ్చారు. బాబమ్మ ముందు రూ.3వేలు వేసి, మరుసటి రోజు రూ.1500 అకౌంట్‌లో వేసింది. వెంటనే లక్ష రూపాయలు ఆమె భర్త రమేష్ అకౌంట్‌లో జమ చేసినట్లు ఆమె ఫోన్ వారు వాట్సప్‌కు పెట్టారు. తర్వాత చెక్కుబుక్ కోసం రూ.10వేలు వేయాలని చెప్పడంతో మళ్లీ వేసింది. ఇలా గత శుక్రవారం నుంచి సోమవారం వరకు రూ.80 వేలు వేసింది. మంగళవారం నుంచి సంబంధిత యాప్ సిబ్బంది స్పందించలేదు. రమేష్ ఏటీఎంకు వెళ్లి కార్డుతో చెక్ చేసుకుంటే తన అకౌంట్‌లో రూ.7 మాత్రమే ఉన్నాయి. గురువారం బాబమ్మ జడ్చర్ల కళాజాత ప్రోగ్రాంకు వెళ్లి వచ్చి శుక్రవారం మధ్యాహ్నం ఎల్‌బీనగర్ గుడ్డి జంగయ్య కాలనీలోని ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆమె స్వగ్రామమైన సల్కర్‌పేట్‌కు మృతదేహం తీసుకొచ్చి శనివారం అంత్యక్రియలు నిర్వహించారు. ఏడాది వారికి బాబు పుట్టి చనిపోయాడు. ధని యాప్ వారి మోసం వల్ల తన భార్య ఆత్మహత్య చేసుకుందని భర్త వాపోయాడు.

త్వరలో ఫార్మసీ కౌన్సిల్‌కు ఎన్నికలు

కందనూలు: ఫార్మసీ విద్యను పూర్తి చేసి, ప్రభుత్వ, ప్రైవేట్ రంగాల్లో విధులు నిర్వహిస్తున్న ఫార్మసిస్టుల కౌన్సిల్ ఎన్నికలు త్వరలో నిర్వహిస్తామని ఉమ్మడి జిల్లా ఫార్మా సొసైటీ అధ్యక్షుడు దామగట్ల కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఫార్మసీ విద్యను పూర్తి చేసి వివిధ ప్రభుత్వ , ప్రైవేట్ రంగాల్లో విధులు నిర్వహిస్తున్న ఫార్మసీస్టుల సమస్యల పరిష్కారం కోసం కౌన్సిల్‌ను బలోపేతం చేయాల్సి ఉందని పేర్కొన్నారు. రాష్ట్ర ఫార్మా సొసైటీ అధ్యక్షుడు ఆకుల సంజయ్‌రెడ్డి ఆదేశాల మేరకు 1948 ఫార్మసీ చట్టం ప్రకారం కౌన్సిల్‌లో ఆరుగురు ఫార్మసిస్టులను ఎన్నుకోవాలని తెలిపారు. తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్, రెన్యూవల్ ఉన్నవారే ఎన్నికల్లో పాల్గొనేందుకు అర్హులని స్పష్టం చేశారు. రెన్యూవల్ చేసుకునేందుకు ఈనెల 31 వరకు గడువుందని, ఫార్మసీస్టులు వెంటనే రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు.

వ్యక్తి అరెస్టు

ధరూరు: భార్యపై హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు శనివారం పోలీసులు తెలిపారు. ఎస్ఐ శివానందంగౌడ్ కథనం ప్రకారం.. మండల పరిధిలోని ఉప్పేరుకు చెందిన బండలబావి మాసిరెడ్డి ఈ నెల 6న భార్యపై హత్యాయత్నానికి పాల్పడ్డాడు. అదే రోజు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం మాసిరెడ్డిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

నీట్ ర్యాంకర్స్‌ను సన్మానించిన 'రిషి'


విద్యార్థినులను అభినందిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, కళాశాల యాజమాన్యం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నీట్–2023లో ఆలిండియా స్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి, దేశంలోనే ఉత్తమ వైద్య కళాశాల ఢిల్లీ ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు పొందిన అనుష్క, ముంబాయి ఎయిమ్స్‌లో ఎంబీబీఎస్ సీటు సాధించిన మౌర్యలను 'రిషి' కళాశాల యాజమాన్యం శనివారం ఘనంగా సన్మానించింది. జాతీయస్థాయిలో ఉత్తమ ర్యాంకులతో ఉన్నతమైన వైద్య కళాశాలల్లో సీట్లు సంపాదించడం గర్వకారణం అని కళాశాల సలహాదారు వెంకటయ్య అన్నారు. మహబూబ్‌నగర్ విద్యా చరిత్రలో ఇంతటి ప్రతిభచాటడం 'రిషి' కళాశాలకే సాధ్యమన్నారు. తమ విద్యార్థులు తమకు తామే సాటి అని మరోసారి నిరూపించారని యాజమాన్యం కొనియాడారు. ఆయా విద్యార్థులకు రాష్ట్ర ఎక్సైజ్, క్రీడాశాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పుష్పగుచ్ఛాలు అందించి అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ చంద్రకళవెంకట్, భూపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ లక్ష్మారెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

జూరాల వద్ద పోలీసు పహారా

- ప్రాజెక్టు దిగువకు వెళ్లేందుకు పర్యాటకులకు నిషేధం


ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద పర్యాటకులకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

అమరచింత: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి వరద భారీగా వచ్చి చేరుకుంటుండటంతో ప్రాజెక్టు పరిసరాల్లో ప్రమాదాలను అరికట్టేందుకు పోలీసు పహారా మరింత పెంచినట్లు సీఐ రత్నం తెలిపారు. ఎస్ఐ జగన్మోహన్, ఏఎస్ఐ జమీరుద్దీన్, సిబ్బంది ప్రాజెక్టుపై శనివారం బందోబస్తు నిర్వహించారు. జూరాల ప్రాజెక్టు ద్వారా 31 క్రస్ట్ గేట్లను ఎత్తి దిగువ నదిలోకి నీటిని వదులుతుండటంతో పుష్కరఘాట్‌లోకి పర్యాటకులను అనుమతించడం లేదు. ఉధృతంగా ప్రవహించే నీటిలో దిగి సెల్ఫీల మోజులో గతేడాది యువకులు గల్లంతైన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ముందస్తుగా దిగువ పుష్కరఘాట్‌లో పోలీసు పహారా నిర్వహించారు. హైదరాబాద్, కర్నూల్, రాయచూర్ ప్రాంతాల నుంచి పర్యాటకులకు అధికంగా వస్తుండటంతో వారిని ప్రాజెక్టు పై భాగంలోనే అనుమతించారు. ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో మొసళ్లు సంచరిస్తుండడం , వరద ఉధృతి పెరగుతుండడంతో ఎవరూ నదిలోకి దిగరాదని అవగాహన కల్పిస్తున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

TO-LET

■ 1700 SFT 2 Floors (1st & 2nd Floor) Commercial Space for Rent Offices, Hospitals, 7/4 Lift Facility Available. Opp Sri Krishna Super Speciality Hospital Newtown, MBNR. Cell: 9399996623.

SERVICES

BUSINESS OFFER

■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్ పేపర్ ప్లేట్స్ & LED మెషిన్స్‌పై ప్రతి నెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం, ఉచిత ముడి పదార్థాలు, 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. ఫోన్: 9810515624, 8800496710

■ Software_Company_Franchise Less Investment & High Profit. www.wilcosolutions.com Ph: 9502650550.

HEALTH CARE

ORTHOPEDIC SURGEON

■ డా॥ఎస్.రవితేజ రెడ్డి, M.S., (ORTHO) (KMC మణిపాల్) ఎముకలు, నరములు, వెన్నెముక & కీళ్ళ మార్పిడి శస్త్ర చికిత్స నిపుణులు. శిరీష పాలీ క్లినిక్, అపోలో హాస్పిటల్ ప్రక్కన, శివ లైన్, N.R.పేట, కర్నూలు. 08518 - 228686, 83412 98666

GYNECOLOGY

■ కార్తీక్ హాస్పిటల్, సుంకేసుల రోడ్, కర్నూలు. సంతాన సమస్యలు, అన్ని రకాల స్త్రీ వ్యాధులు, జనరల్, బి.పి. షుగర్ వ్యాధులకు ఉత్తమ చికిత్స. డా॥ ఎస్.చంద్రశేఖర్, M.D. ఫిజీషియన్, డా॥ పార్వతీదేవి, M.D., DGO., స్త్రీ వ్యాధి, ల్యాపరోస్కోపి నిపుణులు. టైమింగ్స్: 10-8PM, 08518-226162

WANTED

■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము, హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీవార్డెన్స్, ఆయాలు, వార్డ్ బాయ్స్, భార్యాభర్తలు డ్రైవర్స్ కావలెను. ఫోన్: 9391086931, 9246585901

■ మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల ఫార్మా కంపెనీలో సెక్యూరిటీ గార్డులు కావలెను. జీతం 13000/- ఉచిత వసతి, భోజనం, ఫోన్: 6300661014

■ పనివారు కావలెను. హైదరాబాద్, బెంగళూరులో ఉండి ఇంటిపని, వంటపని, వృద్ధుల సేవ, పిల్లల పోషణకు స్త్రీలు, కావలెను. సంప్ర॥ 9391912949, 040-40123376.

■ జాబ్ గ్యారెంటీ మా కంపెనీ కొరకు మహిళలు వెంటనే కావలెను. ఫ్రీ రూమ్+ భోజనం +జీతం: 15–30వేల వరకు, (ఏజెంట్స్‌కి 5000 కమీషన్) ఫోన్: 8886733005

■ Urgent Requirement of experienced Marketing and Sales reps to promote educational products to schools for Telangana and AP. Good Pay offered. Contact:9177979911,950284223, hr@scolaire.in

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!

సాక్షి క్లాసిఫైడ్స్

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు నాలుగు లైన్లకు రూ.: 200/- (Black & White)
అదనపు లైనుకు రూ.: 50 మాత్రమే
5% GST అదనం

వివరాలకు:
మహబూబ్‌నగర్ : 9010234478, 9010522215, 9705135557, 9010869797
జడ్చర్ల : 9010076222
నాగర్‌కర్నూల్ : 9010006785
వనపర్తి : 9010068317
గద్వాల : 9553955603
నారాయణపేట : 9010962007

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే రకరకాల క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధంలేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / ట్రాన్సాక్షన్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు - సాక్షి మేనేజర్